| నేటి మ్యాచ్‌లు | న్యూజిలాండ్ X అఫ్గానిస్థాన్ | శ్రీలంక X బంగ్లాదేశ్ | నెదర్లాండ్స్ X దక్షిణాఫ్రికా | ఆస్ట్రేలియా X ఇంగ్లండ్ |
|---|---|---|---|---|
| | గయానా - ఉ. 5.00 | డల్లాస్ - ఉ. 6.00 | న్యూయార్క్ - రా. 8.00 | బార్బడోస్ - రా. 10.30 |






# అథ్లెటిక్స్ చాంప్ భద్రాద్రి కొత్తగూడెం

- **జేఎన్‌ఎస్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు**

హనుమకొండ చౌరస్తా: హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్‌ఎస్)లో జరిగిన 10వ తెలంగాణ రాష్ట్ర టోర్నీలో ఓవరాల్ విజేతగా భద్రాద్రి కొత్తగూడెం నిలిచింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో యూత్ 18 ఏండ్ల వయసు విభాగంలో హనుమకొండ, అమ్మాయిల అండర్-18 కేటగిరీలో భద్రాద్రి కొత్తగూడెం, పురుషుల విభాగంలో కరీంనగర్, మహిళల విభాగంలో ఖమ్మం టైటిళ్లు దక్కించుకున్నాయి. టోర్నీలో యూత్ కేటగిరీలో పతకాలు సాధించిన ప్లేయర్లు ఈ నెల 15 నుంచి ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయస్థాయి టోర్నీలో పోటీపడనున్నారు. మరో వైపు పురుషుల, మహిళల విభాగంలో ఎంపికైన ప్లేయర్లు ఈ నెల 29 నుంచి పంచకుల(హర్యానా)లో జరిగే నేషనల్ టోర్నీలో పాల్గొంటారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్టాన్లీ జోన్స్, చైర్మన్ రాజేశ్వర్‌రావు, జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపురి రమేశ్, నాగబాబు, డీవైఎస్‌వో అశోక్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ప్లేయర్లకు వీరు పతకాలతో పాటు బహుమతులు అందజేసి అభినందించారు. రాష్ట్రస్థాయి టోర్నీకి ఆర్థిక సహకారం అందించిన ప్రతీ ఒక్కరికీ ఈ సందర్భంగా హనుమకొండ అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి కృతజ్ఞతలు తెలిపారు.

## లక్ష్యసేన్ పోరాటం ముగిసె

జకార్త: ఇండోనేషియా బ్యాడ్మింటన్ టోర్నీలో భారత సింగిల్స్ ఆటగాళ్ల పోరాటం ముగిసింది. పురుషుల క్వార్టర్స్‌లో బరిలో నిలిచిన లక్ష్యసేన్ సైతం కీలక క్వార్టర్స్‌లో నిరాశపరిచాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్స్ పోరులో లక్ష్యసేన్ 22-24, 12-21తో అండర్స్ అంటోన్సెన్ (డెన్మార్క్) చేతిలో ఓడాడు. గంటసేపు జరిగిన మ్యాచ్‌లో లక్ష్యసేన్ పోరాడినా అతడికి ఓటమి తప్పలేదు.



## భారత్‌కు రెండు పతకాలు

మునిచ్: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్‌ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో జర్మనీ వేదికగా ముగిసిన వరల్డ్‌కప్ రైఫిల్/పిస్టల్ టోర్నీలో భారత్ రెండు పతకాలు సాధించింది. శుక్రవారం జరిగిన మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ (3పీ)లో భారత షూటర్ సిఫ్ట్‌కౌర్ సమ్రా కాంస్యం సాధించింది. ఇదే టోర్నీలో భాగంగా గురువారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ ఈవెంట్‌లో సరబ్‌జ్యోత్ సింగ్ పసిడి నెగ్గాడు.



## జాతీయ రేసింగ్ చాంప్ అతికా

బెంగళూరు: ఎఫ్‌ఎమ్‌ఎస్‌సీఐ జాతీయ కార్టింగ్ చాంపియన్‌షిప్‌లో జమ్ముకశ్మీర్‌కు చెందిన యువ రేసర్ అతికా మిర్ విజేతగా నిలిచింది. 7 నుంచి 12 ఏండ్ల వయసు విభాగంలో టీమ్ ఎమ్‌స్పోర్ట్ రేసింగ్ తరపున తొలిసారి పోటీకి దిగిన అతికా పోడియం ఫినిష్‌తో టైటిల్ దక్కించుకుంది. చాంపియన్‌షిప్‌లో ఐదు రౌండ్లలో పోటీపడటం అతికాకు ఇది మొదటిసారి అని తండ్రి ఆసిఫ్ మిర్ పేర్కొన్నారు. ప్రస్తుతం అతికా దుబాయ్‌లో గిబ్బన్స్ దగ్గర శిక్షణ పొందుతున్నది.

# కెనడా కేక

**ఉత్కంఠ పోరులో ఐర్లాండ్ ఓటమి**


నికోలస్ (49)


న్యూయార్క్: పొట్టి ప్రపంచకప్‌లో సంచలనాల పర్వం కొనసాగుతోంది. కొద్దిగంటల క్రితమే పాకిస్థాన్‌ను అమెరికా చిత్తుచేసిన విషయం మరువకముందే మరో 'పసికూన' కెనడా.. అంతర్జాతీయ క్రికెట్‌లో తమకంటే మెరుగైన ఐర్లాండ్‌కు షాకిచ్చింది. గ్రూప్-ఏలో ఉన్న ఈ రెండు జట్ల మధ్య శుక్రవారం నసావు క్రికెట్ స్టేడియం (న్యూయార్క్) వేదికగా జరిగిన లో స్కోరింగ్ థ్రిల్లర్‌లో కెనడా 12 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను ఓడించింది. కెనడా నిర్దేశించిన 138 పరుగుల స్వల్ప ఛేదనలో ఐర్లాండ్.. 20 ఓవర్లలో 125/7 వద్దే ఆగిపోయి ఓటమి వైపున నిలిచింది. అడైర్ (24 బంతుల్లో 34, 3 ఫోర్లు, 1 సిక్సర్), డాక్‌రెల్ (23 బంతుల్లో 30 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్సర్) పోరాటం ఆ జట్టును కాపాడలేకపోయింది. కెనడాబౌలర్లు సమిష్టిగా రాణించారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన కెనడా.. 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' నికోలస్ కిర్టన్ (35 బంతుల్లో 49, 3 ఫోర్లు, 2 సిక్సర్లు), శ్రేయస్ మొవ్వ (36 బంతుల్లో 37, 3 ఫోర్లు) ఆదుకోవడంతో ఆ జట్టు గౌరవప్రదమైన స్కోరు సాధించింది. టీ20 వరల్డ్ కప్‌లో కెనడాకు ఇదే తొలి విజయం.

**సంక్షిప్త స్కోర్లు**

**కెనడా:** 20 ఓవర్లలో 137/7 (నికోలస్ 49, శ్రేయస్ 37, మెక్‌కార్తి 2/24, క్రెయిగ్ 2/32). **ఐర్లాండ్:** 20 ఓవర్లలో 125/7 (అడైర్ 34, డాక్‌రెల్ 30 నాటౌట్, గోర్డాన్ 2/16, డిల్లాన్ 2/18)

# స్కాట్లాండ్ బోణీ

**నమీబియాపై అలవోక విజయం • ఎరాస్మస్ ఇన్నింగ్స్ వృథా**


మైఖెల్ లీస్క్ (35, 1/16)

బార్బడోస్: ఇంగ్లండ్‌తో తొలి మ్యాచ్ వర్షం కారణంగా అర్ధాంతరంగా రద్దు అయినా రెండో మ్యాచ్‌లో స్కాట్లాండ్ బోణీ కొట్టింది. గ్రూప్-బీలో భాగంగా బార్బడోస్ వేదికగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో ఐదు వికెట్ల తేడాతో ఆ జట్టును ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆ జట్టు సారథి గెర్హర్డ్ ఎరాస్మస్ (31 బంతుల్లో 52, 5 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధ శతకంతో ఆకట్టుకోగా వికెట్ కీపర్ జేన్ గ్రీన్ (28) ఆదుకున్నాడు. స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాడ్ వీల్ (3/33), బ్రాడ్లీ క్యూరీ (2/16) నమీబియాను కట్టడిచేశారు. ఒమన్‌తో మ్యాచ్‌లో సమిష్టిగా రాణించిన నమీబియా.. స్కాట్లాండ్‌తో మాత్రం చేతులెత్తేసింది. స్వల్ప ఛేదనను స్కాట్లాండ్ 18.3 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. రిచీ బెర్రింగ్టన్ (35 బంతుల్లో 47 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడగా మైకెల్ లీస్క్ బ్యాట్ (17 బంతుల్లో 35, 4 సిక్సర్లు)తో పాటు బంతి (1/16) రాణించి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అందుకున్నాడు.

**సంక్షిప్త స్కోర్లు**

**నమీబియా:** 20 ఓవర్లలో 155/9 (ఎరాస్మస్ 52, గ్రీన్ 28, వీల్ 3/33, కరీ 2/16). **స్కాట్లాండ్:** 18.3 ఓవర్లలో 157/5 (బెర్రింగ్టన్ 47 నాటౌట్, లీస్క్ 35, ఎరాస్మస్ 2/29, బెర్నార్డ్ 1/20)

# ఫైనల్లో అల్కారజ్

**సెమీస్‌లో సిన్నర్‌పై అద్భుత విజయం • ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్**



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో స్పెయిన్ నయా బుల్ కార్లోస్ అల్కారజ్ తొలిసారి టైటిల్ పోరుకు దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో అల్కారజ్ 2-6, 6-3, 3-6, 6-4, 6-3తో ఇటలీ ప్లేయర్ జానిక్ సిన్నర్‌పై అద్భుత విజయం సాధించాడు. 4 గంటల తొమ్మిది నిమిషాల పాటు సాగిన పోరులో అల్కారజ్ తనదైన పోరాట పటిమ ప్రదర్శించాడు. మైదానంలో ఓవైపు శారీరక సమస్యలతో ఇబ్బందులు ఎదురైనా వెరువకుండా..రెండో సీడ్ సిన్నర్‌కు దీటైన పోటీనిచ్చాడు. తొలి సెట్‌ను సిన్నర్‌కు చేజార్చుకున్న అల్కారజ్ రెండో సెట్ గెలిచి పోరుకు సై అన్నాడు. అయితే తానేం తక్కువ కాదన్న రీతిలో సిన్నర్ కూడా చెలరేగి మూడో సెట్ కైవసం చేసుకోవడంతో మ్యాచ్ రసవత్తరంగా మారింది. తన శక్తినంతా కూడదీసుకుంటూ చెలరేగిన అల్కారజ్ వరుసగా రెండు సెట్లతో పాటు మ్యాచ్‌ను తన కైవసం చేసుకున్నాడు. ఈ పోరులో అల్కారజ్ ఎనిమిది ఏస్‌లు కొడితే..సిన్నర్ ఏడు సంధించాడు. 65 విన్నర్లతో అల్కారజ్ అదరగొట్టగా, సిన్నర్ 39కే పరిమితమయ్యాడు. 58 సార్లు అనవసర తప్పిదాలకు పాల్పడిన స్పెయిన్ స్టార్ మ్యాచ్‌ను నిలబెట్టుకోగలిగాడు. తద్వారా మూడు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఫైనల్ చేరిన పిన్న వయసు(21) ప్లేయర్‌గా అల్కారజ్ నిలిచాడు. జ్వెరెవ్, కాస్పర్ రూడ్ మధ్య మరో సెమీస్ విజేతతో అల్కారజ్ తుదిపోరులో తలపడుతాడు.

# పాక్ క్రికెట్‌కు 'బ్లాక్ డే'

**బాబర్ సేనపై దుమ్మెత్తిపోస్తున్న మాజీలు**

ఇస్లామాబాద్: తొలిసారి టీ20 వరల్డ్ కప్ టోర్నీలో ఆడుతున్న అమెరికా చేతిలో 'సూపర్ ఓవర్'లో ఓడిన పాకిస్థాన్ క్రికెట్ జట్టుపై ఆ దేశ మాజీ ఆటగాళ్లు, విశ్లేషకులు దుమ్మెత్తిపోస్తున్నారు. ఇది పాక్ క్రికెట్‌కు 'బ్లాక్ డే' అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాబర్ సేన వ్యూహాత్మక తప్పిదాలకు పాల్పడి మూల్యం చెల్లించుకున్నదని మాజీ సారథులు రమీజ్ రాజా, వసీం అక్రమ్, మోయిన్ ఖాన్ వాపోయారు. సూపర్ ఓవర్‌లో లెఫ్టార్మ్ పేసర్ అయిన నేత్రావల్కర్ బౌలింగ్‌లో ఫకర్ జమాన్‌కు స్ట్రైకింగ్ ఇవ్వకుండా ఇఫ్తికార్ బ్యాటింగ్‌కు రావడాన్ని వాళ్లు తప్పుబట్టారు. వసీం అక్రమ్ మాట్లాడుతూ.. 'పాకిస్థాన్ ఇలా ఆడుతుందని నేను కలలో కూడా ఊహించలేదు. ఇది చాలా విషాదకరం. సూపర్-8కు వెళ్లాలంటే భారత్‌తో పాటు ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో గెలవాలి. లేకుంటే కష్టమే' అని అన్నాడు. విజయానికి అమెరికాకు అర్హత ఉన్నదని మాజీ కెప్టెన్ మియాందాద్ వ్యాఖ్యానించాడు. హఫీజ్, అక్మల్ సైతం తమ యూట్యూబ్ చానల్స్ వేదికగా బాబర్ సేనపై నిప్పులు చెరిగారు.

# రవూఫ్‌పై బాల్ టాంపరింగ్ ఆరోపణలు

న్యూయార్క్: టీ20 వరల్డ్‌కప్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లోనే అమెరికా చేతిలో ఓటమితో అభిమానుల ఆగ్రహాన్ని చవిచూస్తున్న పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు మరో తలనొప్పి తప్పేట్టు లేదు. గురువారం నాటి మ్యాచ్‌లో ఆ జట్టు స్టార్ పేసర్ హరీస్ రవూఫ్ బాల్ టాంపరింగ్‌కు పాల్పడ్డాడని యూఎస్‌ఏ సీనియర్ క్రికెటర్ రస్టీ థెరాన్ ఆరోపించడం చర్చనీయాంశమైంది. పాక్-యూఎస్‌ఏ మ్యాచ్ ముగిశాక అతడు ఎక్స్(ట్విటర్) వేదికగా స్పందిస్తూ.. '2 ఓవర్లకు ముందే మార్చిన కొత్త బంతితో రివర్స్ స్వింగ్‌ను రాబట్టగలరా? రవూఫ్ తన బొటనవేలితో బంతిపై రుద్దుతూ పరుగెత్తడాన్ని స్పష్టంగా చూడొచ్చు' అంటూ ఐసీసీని ట్యాగ్ చేశాడు. దీనిపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఐసీసీని కోరాడు.

# అగ్నిపర్వతంపై కరీంనగర్ వాసి

***అరుదైన ఘనత సాధించిన పర్వీన్ సుల్తానా***

*విద్యానగర్, జూన్ 7: కరీంనగర్‌కు చెందిన మహిళకు అరుదైన ఘనత సాధించింది. ఆసియా ఖండంలోనే ఏకైక అగ్నిపర్వతమైన అండమాన్ నికోబార్ దీవుల్లోని బెరన్ ఐలాండ్‌లో గల అగ్ని పర్వతంపైకి మొదటిసారిగా అడుగు పెట్టింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్, డెహ్రాడూన్, ఇస్రో వారి ప్రత్యేక పరిశోధన ప్రాజెక్టులో భాగంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మమతాహాన్ సారథ్యంలో వివిధ రంగాల పరిశోధకుల బృందంలో ఒకరైన కరీంనగర్ వాసి మహమ్మద్ పర్వీన్ సుల్తానా గత నెల 29న బెరన్ ఐలాండ్‌లోని అగ్ని పర్వతంపై మొదటిసారిగా అడుగిడింది. అగ్ని పర్వత భౌగోళిక పరిణామాలు, శాస్త్రీయ విశ్లేషణ, పనితీరు, ప్రకృతి విపత్కర పరిస్థితుల అంచనా కోసం అక్కడ లభించిన వివిధ రకాల నమూనాలను సేకరించారు. అండమాన్ ఐలాండ్‌లోని డిగ్లీపూర్ నుంచి రంగౌత్ వరకు సుమారు వంద కిలోమీటర్లకుపైగా వివిధ ప్రాంతాల్లో ఉన్న మడ్ వల్కనోను పరిశీలించారు. ఈ సాహసోపేతమైన పరిశోధన పర్యటనకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్, డెహ్రాడూన్, ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, ఇస్రో, ఇండియన్ కోస్ట్ గార్డ్ (రాజ్‌కమల్) నౌక అండమాన్ నికోబార్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, అండమాన్ నికోబార్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల వారు సహకరించారు.*


*అండమాన్ నికోబార్ దీవుల్లోని బెరన్ ఐలాండ్‌లోని అగ్ని పర్వతంపై మహమ్మద్ పర్వీన్ సుల్తానా*

## గూగుల్ మ్యాప్ నమ్ముకొని..

- **దారి తప్పి డీజిల్ ట్యాంకర్ బోల్తా**
- **డీజిల్ కోసం ఎగబడిన స్థానికులు**

బొమ్మలరామారం, జూన్ 7 : గూగుల్ మ్యాప్ ఆధారంగా వెళ్లిన డీజిల్ ట్యాంకర్.. దారి తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని పెద్దపర్వతాపురం గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకొన్నది. వివరాల్లోకెళ్తే.. హైదరాబాద్ నుంచి బొమ్మలరామారం మండల కేంద్రంలోని రిజినెన్స్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీకి డీజిల్ తీసుకొస్తున్న లారీ ట్యాంకర్ డ్రైవర్ బొమ్మలరామారం నుంచి వెళ్లే ప్రధాన రహదారి గుండా కాకుండా గూగుల్ మ్యాప్‌లో చూసి పర్వతాపురం నుంచి వెళ్లేందుకు బయలుదేరాడు. కాసేపటికి గూగుల్ మ్యాప్ రూట్ చూపించకపోవడంతో డ్రైవర్ లారీని ఒక్కసారిగా నిలిపివేశాడు. దాంతో డీజిల్ లోడ్‌తో ఉన్న లారీ దిగువకు జారి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. కాగా, ట్యాంకర్ నుంచి కారుతున్న డీజిల్‌ను పట్టుకునేందుకు స్థానికులు డబ్బాలతో ఎగబడ్డారు.

## • కోడిపుంజు ఈత కొట్టిందోచ్..

*ములుగు జిల్లా ఏటూరునాగారం మండలకేంద్రంలోని జంపన్నవాగులో ఓడవాడకు చెందిన రమేశ్ అనే వ్యక్తి తన కోడిపుంజుకు ఈత నేర్పుతున్నాడు. లోతుగా ఉన్న నీటిలో వదిలేస్తే అది ఈదుకుంటూ ఒడ్డుకు చేరుతున్నది. కోడి పుంజును పందెం కోసం తయారు చేసే క్రమంలో త్వరగా ఆయాస పడకుండా ఈత నేర్పుతున్నట్టు రమేశ్ తెలిపాడు.*

*– ఏటూరునాగారం*



# ఒకరిని విడిచి మరొకరు ఉండలేక

- **ఇన్‌స్టా గ్రామ్‌లో పరిచయం**
- **ప్రేమ పెండ్లి చేసుకున్న ఇద్దరు యువతులు**
- **పోలీసుల కౌన్సెలింగ్.. తల్లిదండ్రులకు అప్పగింత**
- **ప్రేమికురాలు దూరం కావడంతో యువతి ఆత్మహత్య**
- **మనస్తాపంతో మరో యువతి ఆత్మహత్యాయత్నం!**

కురవి, జూన్ 7 : ప్రేమ గుడ్డిదని ఇందుకే అంటారేమో? సృష్టికి విరుద్ధంగా ఓ ఇద్దరు యువతులు ఒక్కటయ్యారు. వారిని విడదీయడంతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఆత్మహత్య చేసుకొంది. విషయం తెలిసి మరో యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు సమాచారం. మహబూబాబాద్ జిల్లాలో కలకలం సృష్టించిన ఈ ఘటన కురవి మండలం మోద్గులగూడెంలో శుక్రవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మోద్గులగూడెంకు చెందిన కందిపాటి ఎల్లయ్య, మంగమ్మ దంపతుల కూతురు ఉమ (22)కు


ఉమ (ఫైల్)

బయ్యారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో ఆరు నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడి, చివరికి ప్రేమగా మారింది. ఒకరిని విడిచి ఒకరు ఉండలేని పరిస్థితికి వచ్చిన వారు ఎట్టకేలకు ప్రేమ పెండ్లి చేసుకున్నారు. హైదరాబాద్‌కు వెళ్లి సహజీవనం చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం ఉమను ఆమె తల్లిదండ్రులు తీసుకెళ్లడంతోపాటు మరో యువతిని ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. సీరోలు పోలీసులు సదరు ఇద్దరు యువతులతోపాటు వారి తల్లిదండ్రులకు ఈ నెల ఒకటిన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇద్దరూ ఒప్పుకోవడంతో తల్లిదండ్రులకు అప్పగించారు. దూరమయ్యానని మనస్తాపంతో ఉమ ఈనెల 1న ఎలుకల మందు తాగగా, మహబూబాబాద్ జనరల్ దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ప్రేమికురాలు మరణించడంతో మరో యువతి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు తెలిసింది.

# ఇద్దరు వివాహితల సహజీవనం!

- ***ఆరునెలల క్రితం భర్తలను వదిలి ఒక్కటయ్యారు?***
- ***గ్రామ పెద్దలు చెప్పిన ససేమిరా***
- ***సోషల్ మీడియాలో వైరల్***

*కొత్తగూడ, జూన్ 7 : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఏజెన్సీలోని ఓ గిరిజన గూడేనికి చెందిన ఇద్దరు వివాహిత మహిళలు గ్రామం నుంచి పరారై ఒక్కటయ్యారనే వార్త దావానలంలా వ్యాపించింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ గిరిజన గూడేనికి చెందిన ఇద్దరు వివాహితలు గ్రామం నుంచి పరారయ్యారు. వారిలో ఒక మహిళకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మరో మహిళకు భర్త, కొడుకు ఉండగా, ఇటీవల అనారోగ్యంతో కొడుకు మృతిచెందాడు. కాగా, వీరిద్దరూ ఆరునెలల క్రితం గ్రామం నుంచి పరారై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండల ప్రాంతంలో రహస్యంగా జీవిస్తున్నారు. ఒకరు పురుషుడిలా, మరొకరు మహిళలా ఉంటూ సహజీవనం చేస్తున్నారు. ఆ ఇద్దరు మహిళల్లో ఒకరి భర్త భార్య కోసం వెతుక్కుంటూ వారు ఉండే ప్రాంతానికి చేరుకున్నాడు. ఐదు రోజుల క్రితం వారిని గ్రామానికి తీసుకొచ్చి స్థానికుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినా, వారు పెద్దమనుషుల మాటను లెక్క చేయకుండా తమకు నచ్చిన విధంగా ఉంటామని చెబుతున్నట్టు తెలుస్తున్నది. దీంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితులో గ్రామ పెద్దలు ఉన్నారు. ప్రస్తుతానికి సదరు మహిళలు అదే గ్రామంలోని తమ తల్లిగారి ఇండ్లల్లో ఉన్నారు.*




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.